సాక్షి
కుమురం భీం

శుక్రవారం । 16 । జూన్ । 2023



ఎంగేజ్‌మెంట్ తెల్లారే..

ఎంగేజ్‌మెంట్ జరిగిన తెల్లవారే యువకుడు మృతి చెందాడు. ఇది తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య చేసుకోవడంతో సామెలలో విషాదం నెలకొంది. 8లో▸



రైతులపై సాగుభారం

పంటల సాగు భారంగా రైతులకు మారుతోంది. ఏటేటా పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
42.6 /31.6

వాతావరణం

జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు కొనసాగుతాయి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుంది. పగటిపూట వడగాలులు వీస్తాయి. రాత్రి కూడా వేడి కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం ఏర్పాటు చేయాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆసిఫాబాద్ తొలి ఎమ్మెల్యే, ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహంతోపాటు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత సామల సదాశివ మాస్టారు విగ్రహాలను జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని పద్మశాలి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నూరి అశోక్ కోరారు. ఆసిఫాబాద్ పట్టణంలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఆత్రం సక్కుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు బండి శ్రీనివాస్, జంజిరాల శ్రీనివాస్, దాసరి రాజు, దీపక్ ముండే తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సీఆర్టీలుగా పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీటీడీవో మణెమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఈడీ, డీఈడీ పూర్తి చేసి టెట్ అర్హత సాధించి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు శుక్రవారం లోగా గిరిజన శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్, జీవ, భౌతిక శాస్త్రం సబ్జెక్టుల్లో ఖాళీలు ఉన్నాయన్నారు.

13 మంది విద్యార్థుల డిబార్

కాగజ్‌నగర్‌టౌన్: ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో గురువారం 13 మంది డిబార్ అయ్యారు. కాగజ్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఫస్టియర్ గణితం (ఆంగ్లం/తెలుగు), జువాలజీ పరీక్షకు 91 మంది హాజరయ్యారు. పరీక్ష మొదలైన ఐదు నిమిషాలకే ఇంటర్మీడియెట్ బోర్డు ప్రత్యేక బృందం విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో ఆ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రెండు గదుల్లో తనిఖీలు చేయగా 13 మంది వద్ద చిట్టీలు లభించాయి. విద్యార్థులను డిబార్ చేసి కేంద్రంలోని ఇద్దరు ఇన్విజిలేటర్లపై కూడా చర్యలు తీసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ఈ విషయమై పరీక్ష సూపరింటెండెంట్ అమిర్ ఉన్నిసా, అధికారి మహేందర్ సంప్రదించగా బోర్డు అధికారులు విద్యార్థులను డిబార్ చేసినట్లు ధ్రువీకరించారు.

ప్రైవేట్ పాఠశాలల దందాలు అరికట్టాలి



వినతిపత్రం ఇస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఆసిఫాబాద్‌రూరల్: యూనిఫాం, పాఠ్యపుస్తకాల పేరుతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేస్తున్న దందాలు అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని గురువారం జిల్లా కేంద్రంలో డీఈవో అశోక్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సతీశ్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను విద్యార్థులకు అధిక ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. పాఠశాలల్లో వ్యాపారం చేస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు చేపడతామన్నారు. నాయకులు జఫ్వార్, కిరణ్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న డీఏవో

రెబ్బెన(ఆసిఫాబాద్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు హెచ్చరించారు. మండలంలోని ప్రైవేటు ఫర్టిలైజర్ షాపులను గురువారం తనిఖీ చేశారు. ఎరువులు, విత్తనాల విక్రయాలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని నకిలీ విత్తనాలను విక్రయిస్తే షాపుల లైసెన్స్‌లు రద్దు చేసి, యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈవో మంజుల ఉన్నారు.

జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద సర్టిఫికెట్ల కోసం లబ్ధిదారుల పడిగాపులు



దరఖాస్తులకు చిక్కులు..!



ఈ చిత్రంలో కనిపిస్తున్న యువకుడి పేరు గుండా సాయికుమార్. రాష్ట్ర ప్రభుత్వం బీసీ చేతివృత్తిదారులకు అందిస్తున్న ఆర్థిక సాయం కోసం దరఖాస్తు చేసుకునేందుకు వారం రోజులుగా తిరుగుతున్నాడు. కుల, ఆదాయ ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాలు, రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడు. ఎప్పుడూ వెళ్లినా వెబ్‌సైట్ పనిచేయడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆఫీస్ వద్దే ఉంటున్నాడు. ఈ సమస్య ఒక్క సాయికుమార్‌దే కాదు.. జిల్లాలో ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకునే చాలా మంది లబ్ధిదారులదీ ఇదే పరిస్థితి.

- బీసీ చేతివృత్తిదారులకు తప్పని ఇబ్బందులు
- తరచూ మొరాయిస్తున్న సర్వర్లు
- ఆర్థికసాయం దరఖాస్తులకు గడువు నాలుగు రోజులే..
- సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు
- గడువు పెంచాలని లబ్ధిదారుల వేడుకోలు

తిర్యాణి(ఆసిఫాబాద్): వెనుకబడిన తరగతుల కులాల్లో చేతివృత్తులపై ఆధారపడిన 15 కులాలకు ఆర్థికసాయం అందించి భరోసానివ్వాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ నెల 9న మంచిర్యాల జిల్లా పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి కేసీఆర్ కులవృత్తిదారులకు రూ.లక్షల ఆర్థికసాయం అందిస్తామని ప్రకటించారు. అదేరోజు పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దీని కోసం బీసీ కార్పొరేషన్‌కు రూ.100 కోట్ల నిధులు కేటాయించారు. ఆర్థికసాయం పొందేందుకు ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. అయితే దరఖాస్తులకు అవసరమైన ధ్రువపత్రాల కోసం లబ్ధిదారులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. సర్వర్లు సక్రమంగా పనిచేయకపోవడంతో సర్టిఫికెట్ల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతోంది.

సర్వర్ స్లో..

చేతివృత్తిదారులకు అందిస్తున్న ఆర్థికసాయం పొందేందుకు లబ్ధిదారులకు ధ్రువపత్రాలు తప్పనిసరి. సర్టిఫికెట్ల ఆధారంగానే అర్హుల ఎంపిక ఉంటుందని అధికారులు ప్రకటించారు. ఈ నెల 27 నుంచి జూలై 4 వరకు తుది జాబితాను ప్రకటించనున్నారు. దానికి అనుగుణంగా దశల వారీగా ఆర్థికసాయం అందించాలని ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దరఖాస్తులకు సమయం తక్కువగా ఉండటంతో ధ్రువపత్రాల కోసం లబ్ధిదారులంతా ఒకేసారి ఆన్‌లైన్ అప్లికేషన్లు పెట్టుకుంటున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితి ఉండటంతో సర్వర్ తరచూ మొరాయిస్తోంది. దీనికి తోడు సిగ్నల్ సమస్య కారణంగా జిల్లాలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. అలాగే రెవెన్యూ సిబ్బంది తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో బిజీగా గడుపుతుండటంతో సర్టిఫికెట్ల మంజూరు ఆలస్యమవుతోంది. మీసేవ కేంద్రాల నుంచి ఎలాగో ధ్రువపత్రాలు తెచ్చుకున్నా ఆర్థికసాయం కోసం దరఖాస్తు చేసుకునే ఓబీఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్ కూడా సక్రమంగా పనిచేయడం లేదు. దరఖాస్తు చేసుకునేందుకు నాలుగు రోజులే సమయం ఉండటంతో లబ్ధిదారుల్లో ఆందోళన మొదలైంది. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని దరఖాస్తు గడువు పొడిగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

1,935 మంది దరఖాస్తు..

బీసీ కులవృత్తిదారులకు అందిస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం కోసం జిల్లాలో ఇప్పటివరకు 1,935 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని సంబంధిత శాఖ అధికారులు వెల్లడించారు. ఈ నెల 20 తేదీతో దరఖాస్తుల గడువు ముగియనుండటంతో లబ్ధిదారులు ధ్రువపత్రాల కోసం మీసేవ కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్దే పడిగాపులు కాస్తున్నారు.

గడువు పొడిగించాలి



చేతివృత్తిదారులకు ప్రభుత్వం అందించే రూ.లక్ష ఆర్థికసాయం దరఖాస్తు గడువును మరో పది రోజులు పొడిగించాలి. కుల, ఆదాయ సర్టిఫికెట్లు సకాలంలో చేతికందడం లేదు. ఓబీఎంఎస్ఎస్ సాఫ్ట్‌వేర్‌లోనూ తరచూ సమస్య ఏర్పడుతోంది. జిల్లా ఇప్పటివరకు సగం మంది లబ్ధిదారులు కూడా దరఖాస్తు చేసుకోలేదు. లబ్ధిదారుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గడువును పొడిగించే విధంగా నిర్ణయం తీసుకోవాలి.

– నల్లూరి జగదీశ్, రజక సంఘం జిల్లా నాయకుడు

20లోగా దరఖాస్తు చేసుకోవాలి

బీసీ చేతివృత్తిదారులకు ప్రభుత్వం అందించే ఆర్థిక సాయం కోసం అర్హులైన వారు ఈ నెల 20లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. జిల్లాలో ఇప్పటి వరకు 1,935 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు వాటి జిరాక్స్ పత్రాలను ఎక్కడా సమర్పించాల్సిన అవసరం లేదు. దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు.

– సత్యనారాయణరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి

గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకం

- కలెక్టర్ హేమంత్ బోర్కడే



జాతీయ జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ హేమంత్ బోర్కడే, తదితరులు

రెబ్బెన(ఆసిఫాబాద్): గ్రామాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని కలెక్టర్ హేమంత్ బోర్కడే అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం రెబ్బెన మండలం ఇందిరానగర్‌లో నిర్వహించిన పల్లె ప్రగతి దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం ఎదుట జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. పల్లె ప్రగతి కార్యక్రమంతో నేడు గ్రామాల స్వరూపమే మారిందని పేర్కొన్నారు. పారిశుధ్య పనుల నిర్వహణకు ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్, ట్యాంకర్, ట్రాలీని ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ చెత్తను సేకరించడంతో ప్రజల ఆరోగ్య ప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. శ్మశానవాటిక, డంపింగ్‌యార్డులు, నర్సరీ, పల్లె ప్రకృతివనాల ఏర్పాటుతో ప్రజల ఇబ్బందులు తప్పాయని పేర్కొన్నారు. ప్రతీ ఇంటికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందుతోందన్నారు. పారిశుధ్యం కోసం నిరంతరం కృషి చేస్తున్న కార్మికుల కృషిని గుర్తిస్తూ 'సఫాయన్నా నీకు సలాం' అని సత్కరిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ అవార్డుల్లో తెలంగాణకు 30 శాతానికి పైగా రావడం సంతోషకరమన్నారు. స్వచ్ఛత, పచ్చదనంతో కూడిన గ్రామాలను తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులను శాలువాలతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, సర్పంచ్ దుర్గం రాజ్యలక్ష్మి, తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో అంజద్‌పాషా, పంచాయతీ కార్యదర్శి నమ్రత, నాయకులు దుర్గం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'పల్లె ప్రగతి'తో మారిన గ్రామాల స్వరూపం

- ఎమ్మెల్యే ఆత్రం సక్కు



జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే సక్కు, తదితరులు

ఆసిఫాబాద్‌రూరల్: పల్లె ప్రగతి కార్యక్రమంతో గ్రామాల స్వరూపం సంపూర్ణంగా మారిందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. పల్లె ప్రగతి దినోత్సవం సందర్భంగా ఆసిఫాబాద్ మండలం అప్పపల్లి, కొటగూడ, గోవింద్‌పూర్, అంకుసాపూర్‌లో నూతన పంచాయతీ భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలాభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్నారు. పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సింగిల్ విండో చైర్మన్ అలీబిన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లన్న, ఎంపీవో ప్రసాద్, ఎంపీడీవో శశికళ, ఏపీవో చంద్రశేఖర్, సర్పంచులు బాపురావు, లక్ష్మి నారాయణ, మధవి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

'అబ్దుల్ రషీద్‌ను అరెస్ట్ చేయాలి'



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

చింతలమానెపల్లి(సిర్పూర్): ఆదివాసీలపై దుర్మార్గాలకు పాల్పడుతున్న డబ్బా సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్‌ను వెంటనే అరెస్టు చేయాలని తుడుందెబ్బ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గొడం నగేశ్, జెడ్పీ మాజీ చైర్మన్ సిడాం గణపతి డిమాండ్ చేశారు. తుడుందెబ్బ ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేస్తూ మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ డబ్బా సర్పంచ్ కుమారుడు అబ్దుల్ రషీద్ ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. గ్రామంలోని ఓ మహిళ ఇంటిలో చొరబడి పారిపోతుండగా స్థానిక ఆదివాసీలు పట్టుకోగా.. వారిని కులంపేరుతో దూషించాడని ఈ నెల 5న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు. పోలీసులు ఇప్పటివరకు అతడిని అరెస్టు చేయలేదని తెలిపారు. ఆదివాసీల మనోభావాలను కించపరచిన రషీద్‌ను 24 గంటల్లో అరెస్టు చేయని పక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ నెల 19న కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలను ముట్టడిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు శ్యాంరావు, మనోజ్, నారాయణ, లక్ష్మి, పద్మ, పోషక్క, కమల తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పనిముట్లు అందజేత



జీపీ కార్మికులకు పనిముట్లు అందజేస్తున్న అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పల్లె ప్రగతి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం పారిశుధ్య కార్మికులను సన్మానించి, వారికి బూట్లు, ఇతర పనిముట్లు అందజేశారు. అనంతరం మండలంలోని మాణిక్‌గూడ నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్నారు. ఉత్తమ పంచాయతీ కార్మికులను సన్మానించి, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పల్లెప్రగతి కార్యక్రమం ద్వారా పారిశుధ్య నిర్వహణతోపాటు పచ్చదనం, పరిశుభ్రత పెరుగుతుందన్నారు. గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీపీవో సురేందర్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొరాయించిన రైల్వేగేటు



సిర్పూర్(టి): సిర్పూర్(టి)- కాగజ్‌నగర్ ప్రధాన రహదారిలో పెద్దబండ- వేంపల్లి గ్రామాల మధ్య ఉన్న రైల్వేగేటు గురువారం మధ్యాహ్నం మొరాయించడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. సుమారు రెండు గంటలపాటు రైల్వేగేటు వేసి ఉండటంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఎండల తీవ్రతతో కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేక సిర్పూర్(టి), కాగజ్‌నగర్ మండలాల ప్రజలతోపాటు కౌటాల, బెజ్జూర్, చింతలమానెపల్లి, మహారాష్ట్ర వైపు వెళ్లే వారు అవస్థలు పడ్డారు. మరమ్మతుల అనంతరం రైల్వేగేటును పైకి ఎత్తడంతో వాహనాల రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

నాణ్యతలేని 'నెట్'





వాంకిడి నర్సరీలో దెబ్బతిన్న షేడ్ నెట్

↑ హరితహారం కార్యక్రమంలో భాగంగా పది వేల మొక్కలు పెంచాలనే లక్ష్యంతో తిర్యాణి మండలం నాయకపుగూడ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేశారు. వేసవిలో ఎండల నుంచి మొక్కలను రక్షించేందుకు దాదాపు రూ.25వేల వరకు ఖర్చు చేసి గ్రీన్ నెట్ (షేడ్ నెట్) ఏర్పాటు చేశారు. ఇటీవల వీచిన ఈదురుగాలులకు ఈ షేడ్‌నెట్ పూర్తిగా కొట్టుకుపోయింది. ఏటా ఇలా తాత్కాలికంగా నెట్లు ఏర్పాటు చేస్తుండటంతో ప్రజాధనం వృథా అవుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

- జిల్లాలోని 335 పంచాయతీల్లో నర్సరీలు
- మొక్కల రక్షణకు రూ..లక్షలు వెచ్చించి ఏటా షేడ్ నెట్ల ఏర్పాటు
- చిన్నపాటి గాలులకే చిరిగిపోతున్న వైనం
- శాశ్వత చర్యలు చేపట్టని యంత్రాంగం

వాంకిడి(ఆసిఫాబాద్): రాష్ట్రంలో పచ్చదనం పెంచేందుకు ప్రభుత్వం ఏటా తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. దీనికి పెద్దమొత్తంలో నిధులు కేటాయిస్తూ వర్షాకాలంలో భారీగా మొక్కలు నాటేందుకు వీలుగా ప్రతీ పంచాయతీల్లోనూ నర్సరీలు ఏర్పాటు చేస్తోంది. వేసవి ప్రారంభంలోనే అధికారులు పంచాయతీల్లో స్థలాలను గుర్తించి మొక్కలు పెంచేందుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. వర్షాకాలం వరకు ఎండల నుంచి మొక్కల రక్షణకు తాత్కాలికంగా షేడ్ నెట్లు (నీడ కోసం) ఏర్పాటు చేస్తున్నారు. రూ.లక్షలు వెచ్చించినా నాసిరకమైన నెట్లు కొనుగోలు చేస్తుండటంతో చిన్నపాటి ఈదురుగాలులకే అవి చిరిగిపోతున్నాయి.

ప్రతీ పంచాయతీలో నర్సరీ..

జిల్లాలోని 335 గ్రామ పంచాయతీల్లో నర్సరీలు కొనసాగుతున్నాయి. ఈ ఏడాది హరితహారం కార్యక్రమంలో భాగంగా 43.60 లక్షల మొక్కలు పెంచుతున్నారు. వేసవిలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీల వరకు ఉండటంతో ఏటా మొక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పంచాయతీ నిధుల నుంచి నీడ కోసం నెట్లు కొనుగోలు చేస్తున్నారు. హరితహారం మొక్కల పెంపకం కోసం గ్రీన్ ఫండ్ పేరిట ఈ నిధులు ఖర్చు చేస్తున్నారు. ఒక్కో నర్సరీకి మొక్కల లక్ష్యానికి అనుగుణంగా పది నుంచి 40 వరకు నెట్లు అవసరమవుతాయి. దీంతో ఒక్కో నర్సరీకి గరిష్టంగా రూ.50వేల వరకు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలోని నర్సరీల్లో షేడ్ నెట్ల ఏర్పాటు కోసం ప్రతీ ఏటా సుమారు రూ.కోటిన్నర వరకు వెచ్చిస్తున్నట్లు తెలుస్తోంది. భారీగా నిధులు కేటాయిస్తున్నా.. అధికారులు మాత్రం నాణ్యతపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా అకాల వర్షాలు, ఈదురుగాలులకు ఇవి పూర్తిగా దెబ్బతింటున్నాయి. ఒక్కసారి దెబ్బతిన్న వీటిని మరోసారి వినియోగించేందుకు వీలుండదు. ఫలితంగా మరో ఏడాది కొత్తవి కొనుగోలు చేయాల్సిందే. దీంతో భారీగా ప్రజాధనం వృథా అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ ఏడాది వీచిన గాలిదుమారాలకు జిల్లాలో 80 శాతానికి పైగా నెట్లు దెబ్బతిన్నట్లు తెలుస్తోంది.

నాసిరకమైనా.. అధిక బిల్లులు

నర్సరీల్లో మొక్కల రక్షణకు ఏర్పాటు చేస్తున్న గ్రీన్ నెట్ల విలువ కేవలం రూ.2వేల వరకు మాత్రమే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. అయితే అధికారులు మాత్రం వాటి విలువను రికార్డులో రూ.4 వేల నుంచి రూ.5వేల వరకు చూపుతున్నారు. నిధులు పక్కదారి పట్టించేందుకే అధిక బిల్లులు నమోదు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జిల్లా స్థాయి అధికారులు దీనిపై విచారణ చేపట్టి, ప్రజాధనం వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రైవేట్ నర్సరీల యజమానులు వినియోగించే విధంగా నాణ్యమైన నెట్లు కొనుగోలు చేయాలనే డిమాండ్ వినిపిస్తుంది. శాశ్వత ప్రతిపాదికన నెట్లు ఏర్పాటు చేస్తే పంచాయతీలపై ఆర్థికభారం తగ్గే అవకాశం కూడా ఉంది.

భారీగా ప్రజాధనం వృథా

ఎండల నుంచి మొక్కల రక్షణకు నర్సరీల్లో నాసిరకమైన షేడ్ నెట్లు ఏర్పాటు చేస్తున్నారు. తాత్కాలికంగా ఏర్పాటు చేస్తున్న నెట్లు చిన్నపాటి ఈదురుగాలులకే దెబ్బతిని పనికిరాకుండా పోతున్నాయి. ప్రైవేట్ నర్సరీల యజమాన్యాలు పాటించే విధంగా శాశ్వతంగా నెట్లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే చాలా చోట్ల నెట్లు దెబ్బతినడంతో భారీగా ప్రజాధనం వృథాగా మారింది. ఉన్నతాధికారులు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

– ఉపేందర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

క్లుప్తంగా

లాసెట్‌లో 182వ ర్యాంక్


రాజశేఖర్

చెన్నూర్: జిల్లాకు చెందిన విద్యార్థి లాసెట్‌లో రాష్ట్రస్థాయిలో 182వ ర్యాంకు సాధించాడు. కోటపల్లి మండలం రొయ్యలపల్లికి చెందిన నిరుపేద వ్యవసాయ కూలీ అక్కెం రాజం, పోశక్క దంపతుల కుమారుడైన రాజశేఖర్ పట్టణంలోని మైనార్టీ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. మైనార్టీ కళాశాలకు చెందిన 9 మంది విద్యార్థులు లాసెట్‌కు హాజరుకాగా ఆరుగురు క్వాలీఫై అయినట్లు ప్రిన్సిపాల్ తిరుపతి తెలిపారు. విద్యార్థి రాజశేఖర్‌ను ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నీట్‌లో మెరిసిన గురుకుల ఆణిముత్యం


విద్యార్థినిని అభినందిస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: నీట్ ఫలితాల్లో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులం విద్యార్థిని ఐనాల సొగంధి యశస్విని అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. బెల్లంపల్లి సంక్షేమ బాలుర సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, జానకి దంపతుల కూతురు సొగంధి యశస్విని బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పదోతరగతి వరకు చదువుకుంది. హైదరాబాద్ గౌలిదొడ్డి సీవోఈ కళాశాలలో చేరి ఇంటర్‌లో 960మార్కులు సాధించింది. 2023 నీట్ పరీక్షకు హాజరై జాతీయస్థాయిలో 11,329 ర్యాంకు సాధించింది. గురువారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సదరు విద్యార్థినిని అభినందించారు.

ఈసెట్‌లో సింగరేణి విద్యార్థుల ప్రతిభ

శ్రీరాంపూర్(మంచిర్యాల): ఈసెట్–2023 ఫలితాల్లో సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఆనంద్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ.సాద్విక్ (మెకానికల్) 4వ ర్యాంక్, బీ.సాహిత్ కుమార్(మైనింగ్) 5వ ర్యాంకు, డీ.సంజయ్‌కుమార్ (మైనింగ్) 13వ ర్యాంకు, యూ.నిఖిల్ తేజ(ఎలక్ట్రికల్)17వ ర్యాంకు, టీ. చిన్మయి (మైనింగ్) 19వ ర్యాంకు, పీ.వరుణ్ (కంప్యూటర్)లో 25వ ర్యాంకు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. సదరు విద్యార్థులను జీఎం (ఎడ్యుకేషన్) ఎస్.వెంకటేశ్వర్‌రావు, ఏరియా జీఎం బీ.సంజీవరెడ్డి, కరస్పాండెంట్ ఏ.రాజేశ్వర్ అభినందించారు.

విద్యార్థిని అదృశ్యం

కౌటాల: మండల కేంద్రంలోని నదిమాబాద్ కాలనీకి చెందిన కామ్రె శ్రీవాణి(17) అదృశ్యమైనట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇటీవలే పదోతరగతి పూర్తి చేసిన బాలిక ముగ్గురు స్నేహితులతో కలిసి ఈ నెల 13న టీసీ కోసం సిర్పూర్(టి)లోని బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లింది. అనంతరం స్నేహితులకు చెప్పకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకూ పాఠశాల వద్దే వేచిచూసి ఇంటికి వచ్చారు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు చెప్పడంతో బంధువుల ఇళ్లలో వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. బాలిక తండ్రి గోవర్ధన్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

వైద్యం కోసం వెళ్లొస్తూ..

అనారోగ్యంతో బాధపడుతున్న కుమారుడికి వైద్యం చేయించేందుకు తీసుకెళ్లారు తల్లిదండ్రులు. ఎండాకాలమని ఉదయమే ద్విచక్రవాహనంపై ముగ్గురూ బయల్దేరారు. వైద్యుడి వద్దకు వెళ్లి చికిత్స చేయించారు. ఎండ కాకముందే ఇల్లు చేరాలని తిరుగు పయనమయ్యారు. కానీ, ఆ తండ్రీ కొడుకులకు అదే చివరి ప్రయాణమైంది. ట్రాక్టర్ రూపంలో ఎదురొచ్చిన మృత్యువు ఇద్దరిని కబళించింది. ఈ ఘటనలో తల్లికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయం వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాద ఘటన పర్యావసనాలు.


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

- రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల దుర్మరణం
- తల్లికి తీవ్ర గాయాలు
- ట్రాక్టర్ రూపంలో దూసుకొచ్చిన మృత్యువు
- శ్రీరాంపూర్‌లో ఘటన

శ్రీరాంపూర్(మంచిర్యాల): మందమర్రి మండలం శంకర్‌పల్లికి చెందిన దర్శనాల రమేశ్ (40), వెన్నెల దంపతులకు కుమారుడు సూర్యతేజ (12), కూతురు సువిష్ణ (8) సంతానం. రమేశ్ తాపీమేస్త్రీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సూర్యతేజ మందమర్రిలోని మోడల్ స్కూల్‌లో ఏడోతరగతి, సువిష్ణ మూడో తరగతి చదువుతున్నారు. కుమారుడికి ఆరోగ్యం బాగాలేకపోవడంతో చికిత్స చేయించేందుకు తల్లిదండ్రులు గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై గోదావరిఖనికి బయలుదేరారు. చికిత్స అనంతరం మళ్లీ ఇంటికి తిరుగుపయనమయ్యారు. ఈక్రమంలో జీఎం కార్యాలయం వద్దకు రాగానే మందమర్రి వైపు తిరుగుతుండగా సిమెంట్ లోడ్‌తో అతివేగంగా వచ్చిన ట్రాక్టర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో తండ్రీకొడుకులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. వెన్నెలకు తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108లో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆగమన్నా ఆగలే...

'వై జంక్షన్ వద్ద రోడ్డు క్రాస్ అవుతున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. రోడ్డు దాటుతుండగా మా బండి కొద్దిగా రోడ్డు మీదకు వచ్చింది. అప్పుడే ముందునుంచి స్పీడ్‌గా ట్రాక్టర్ వస్తుంటే నేను డ్రైవర్ కేసీ చేయి ఊపుతూ ఆగు.. ఆగు అని మొత్తుకున్నా.. అయినా స్పీడ్‌గా వచ్చి మాబండిని గుద్దిండు' అని వెన్నెల బోరున విలపిస్తూ తెలిపింది.

కానరాని హెచ్చరిక బోర్డులు

ప్రమాదస్థలం వై జంక్షన్‌లా ఉంటుంది. మల్లీడౌన్‌లో ఉంటుంది. ప్రమాదాలు జరుగకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయలేదు. శ్రీరాంపూర్ నుంచి ఇందారంవెపు వెళ్లే వారికి మందమర్రి వైపు నుంచి వచ్చే వాహనాలు కనిపించకుండా రోడ్డు ఉంది. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు మందమర్రి సైడ్ తిరుగుతాయా? అన్న సంగతి కూడా తెలియక అలాగే వేగాన్ని కొనసాగిస్తున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ ఇలాగే స్పీడ్‌గా నడిపిఉంటాడని, అదే సమయంలో బైక్ వస్తుండటంతో కంట్రోల్ కాక ప్రమాదం చేసి ఉంటాడనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

భూత వైద్యం కోసమేనా?

సూర్యతేజ స్కూల్‌కు సక్రమంగా వెళ్లకుండా మారాం చేస్తుండడంతో దంపతులిద్దరూ కలిసి తమ కుమారుడిని గోదావరిఖనిలోని ఓ భూత వైద్యుని వద్దకు తీసుకెళ్లినట్లు తెలిసింది. తాయత్తు కట్టించడం కోసమే గురువారం గోదావరిఖనికి వెళ్లినట్లు బంధువులు భావిస్తున్నారు.

'వెన్నెల'కు చీకటే మిగిలింది


చికిత్స పొందుతున్న వెన్నెల

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెన్నెలకు జీవితంలో చీకటే మిగిలింది. జీవితాంతం తోడుగా ఉంటానన్న భర్త, పెద్దయ్యాక ఆసరాగా ఉంటాడను కన్న కుమారుడు ఇద్దరూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె జీవితం దుఃఖసముద్రంలో మునిగింది. ప్రమాదంలో రెండుకాళ్లు, చేయి విరగడంతో కదలలేని స్థితిలో ఉంది. ఏడుస్తున్న బిడ్డను దగ్గరకు తీసుకోలేని పరిస్థితిలో ఆమె రోదించడం పలువురిని కలిచివేసింది.

తండ్రి, సోదరుడు మార్చురీలో...తల్లి ఆస్పత్రిలో


రోదిస్తున్న సువిష్ణ

మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీ వద్ద తండ్రి, సోదరుని మృతదేహాలు, బెడ్‌పై తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న తల్లిని చూసి రోదిస్తున్న చిన్నారి సువిష్ణను ఆపడం ఎవరితరమూ కాలేదు. డాడీ లే... అన్నా లేరా. అంటూ చిన్నారి ఏడ్వడం అక్కడున్న వారిని కంటతడి పెట్టించింది.

ఎంగేజ్‌మెంట్ తెల్లారే
యువకుడు దుర్మరణం


రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు, యువజన సంఘాల నాయకులు

- ఆసిఫాబాద్ వైపు నుంచి స్వగ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- కుమారుడి మరణం తట్టుకోలేక తండ్రి ఆత్మహత్య
- వాంకిడి మండలం సామెలలో విషాదం


సంఘటన స్థలంలో మృతదేహం

వాంకిడి(ఆసిఫాబాద్): ప్రేమించిన యువతిని పెళ్లి చేసుకుని సంతోషంగా బతుకుదామనుకున్న ఆ యువకుడు ఎంగేజ్‌మెంట్ జరిగిన తెల్లవారే కానరాని లోకానికి వెళ్లిపోయాడు. కుమారుడి ఎదుగుదలను కళ్లారా చూద్దామనుకున్న ఆ తండ్రి కుమారుడి మరణవార్త విని తట్టుకోలేక పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాదకర సంఘటన కుమురంభీం జిల్లా వాంకిడి మండలంలోని సామెల గ్రామంలో చోటు చేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వాంకిడి మండలంలోని సామేల గ్రామానికి చెందిన వసాకె తులసీరాం(21) ఆసిఫాబాద్‌లోని ఓ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. బుధవారం అదే గ్రామానికి చెందిన యువతితో ఎంగేజ్‌మెంట్ జరిగింది. కార్యక్రమానికి వచ్చిన బంధువుల్లో ఒకరిని దింపేందుకు గురువారం ఉదయం స్కూటీపై ఎల్లారం బయలుదేరాడు. తిరుగుప్రయాణంలో బుదల్‌ఘాట్ వాగు దాటాక జైత్‌పూర్ రోడ్డు వద్ద గల కంకర క్రషర్ సమీపంలో జాతీయ రహదారి–363పై ఎదురుగా వచ్చిన టిప్పర్ లారీ ఢీకొట్టింది. దీంతో తులసీరాంకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పురుగుల మందుతాగి తండ్రి ఆత్మహత్య

సామెల గ్రామానికి చెందిన వసాకే భీంరావు (45)ది వ్యవసాయ కుటుంబం. గ్రామ ఉప సర్పంచ్‌గా కూడా సేవలందిస్తున్నాడు. అతనికి కూతురు కళావతి, కుమారుడు తులసీరాం సంతానం. కుమారుడి మరణవార్త తెలుసుకున్న భీంరావు మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు.

జాతీయ రహదారిపై ఉద్రిక్తత

తండ్రీకొడుకుల మృతికి కారణమైన డీబీఎల్ కంపెనీ యాజమాన్యం తీరుకు నిరసనగా సంఘటన స్థలం వద్ద గ్రామస్తులు, బంధువులు, యువజన సంఘాల నాయకులు రాస్తారోకో నిర్వహించారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ రహీముద్దీన్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఆసిఫాబాద్ సీఐ రాణాప్రతాప్, ఎస్సైలు రమేశ్, సాగర్, గంగన్న కంపెనీ యాజమాన్యం, బాధిత కుటుంబ సభ్యులతో సంప్రదింపులు జరిపారు. రూ.19 లక్షలకు ఒప్పందం జరగడంతో ఆందోళన విరమించారు.

అలుముకున్న విషాదఛాయలు

ఎంగేజ్‌మెంట్ జరిగిన తెల్లారే యువకుడు మృతి చెందడం, కుమారుడి మరణవార్త విన్న తండ్రి పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకోవడంతో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ప్రేమ దక్కడం లేదన్న ప్రతీకారంతోనే హత్య


వివరాలు వెల్లడిస్తున్న సీఐ అల్లం నరేందర్

రెబ్బెన(ఆసిఫాబాద్): తనను ప్రేమించడంలేదన్న కోపంతో యువతి కుటుంబంపై పగ పెంచుకున్న యువకుడు స్నేహితులతో కలిసి ఆమె సోదరుడిని దారుణంగా హత్య చేసినట్లు రెబ్బెన సీఐ అల్లం నరేందర్ తెలిపారు. తిర్యాణి మండలంలోని ఉల్లిపిట్టలో ఈ నెల 1న జరిగిన హత్యకు సంబంధించిన వివరాలను గురువారం సీఐ వెల్లడించారు. ఉల్లిపిట్ట గ్రామానికి చెందిన బార్కుంట తరుణ్ అదే గ్రామానికి చెందిన యువతిని కొంతకాలంగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. సదరు యువతి పలుమార్లు తిరస్కరించినా వెంటపడడం ఆగలేదు. దీంతో యువతి విషయాన్ని తన తల్లిదండ్రులకు చెప్పడంతో తరుణ్‌ను మందలించారు. అయినప్పటికీ అతనిలో మార్పురాకపోవడంతో తల్లిదండ్రులు తమ కుమార్తెను ఆదిలాబాద్‌లో ఉన్న మరో కూతురు ఇంటికి పంపించారు. అక్కడికి సైతం వెళ్లి వేధింపులకు పాల్పడేవాడు. అయినా తన ప్రేమను తిరస్కరించడంతో ఆమె కుటుంబంలో ఎవరినో ఒకర్ని అంతమొందించాలని అనుకున్నాడు. ఈ నెల 1న యువతీ తల్లి ఉపాధి హామీ పనులకు వెళ్లగా సోదరుడు ఉదయ్ కిరణ్ (14) ఇంట్లో ఒక్కడే ఉండడాన్ని గమనించిన తరుణ్, నరుణ్ ఇంట్లోకి ప్రవేశించి వెంట తెచ్చుకున్న గ్లౌజులు, టవెల్ సహాయంతో గొంతునులిమి హత్యచేశారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సమావేశంలో తిర్యాణి ఎస్సై సీహెచ్ రమేశ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

లక్సెట్టిపేట(మంచిర్యాల): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై లక్ష్మణ్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చందారం గ్రామానికి చెందిన ఉపేందర్ (28) గురువారం ద్విచక్ర వాహనంపై లక్సెట్టిపేటకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతుండగా పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో ఒకే రోజు ఇద్దరు మృతి


కామెర శ్రీనివాస్ గుంటి శ్రీశైలం

నెన్నెల(బెల్లంపల్లి): మండలంలో ఒకేరోజు ఇద్దరు గుండెపోటుతో మృతి చెందడంతో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. కోనంపేటకు చెందిన ఒగ్గు కళాకారుడు గుంటి శ్రీశైలం(55) గురువారం ఉదయం వాకింగ్‌కు వెళ్లివచ్చి ఇంటివద్దేకు ప్పకూలాడు. కుటుంబ సభ్యులు ముందుగా మంచిర్యాలకు అక్కడి నుంచి కరీంనగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతునికి భార్య బాయమ్మ, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. ఆవుడం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు కామెర శ్రీనివాస్(25) అతని తల్లి లక్ష్మిని ఉదయం అన్నం వండమని చెప్పాడు. నిమ్మకాయ పచ్చడి కావాలనడంతో తెచ్చేందుకు లక్ష్మి దుకాణానికి వెళ్లింది. ఇంటికి వచ్చేసరికే శ్రీనివాస్ కూర్చున్న చోటే చనిపోయాడు. మూడు నెలల క్రితం గుండెకు వాపు వచ్చిందని, చికిత్స అనంతరం బాగానే ఉన్నాడని మృతుని తల్లి రోదిస్తూ తెలిపింది.

ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య


వినయ్ (ఫైల్)

ఆసిఫాబాద్‌రూరల్: ఉరేసుకుని విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని వట్టివాగుకాలనీలో గురువారం చోటు చేసుకుంది. మృతుని కుటుంబ సభ్యులు, ఎస్సై గంగన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వట్టివాగు (ఆర్‌ఆర్‌కాలనీ)కు చెందిన ఉయిగు వినయ్ (12) ఉట్నూర్‌లోని లాల్‌టెక్డీ పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్నాడు. పాఠశాలలు పునఃప్రారంభం కావడంతో బడికి వెళ్లాలని తల్లిదండ్రులు జంగు, కౌసల్య సూచించారు. నేను వెళ్లనని, ఇక్కడే ఉండి చదువుకుంటానని మారాం చేశాడు. తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో అక్కడికి వెళ్లడం ఇష్టంలేక సాయంత్రం ఇంటివద్దే ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొలంపనులకు వెళ్లిన తల్లిదండ్రులు ఇంటికి వచ్చి చూసేసరికి ఉరేసుకుని కనిపించాడు. పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై గంగన్న సంఘటన స్థలాన్ని సందర్శించారు. మృతుని తండ్రి జంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని టీకానపల్లి గ్రామానికి చెందిన పొలంపల్లి భీమయ్య(75) బుధవారం రాత్రి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. టీకానపల్లికి చెందిన భీమయ్య ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్నాడు. అంతేకాకుండా అతని కుమారుడు రెండేళ్ల క్రితం మృతి చెందడంతో అప్పటినుంచీ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో బుధవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని మనుమడు కళ్యాణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలి


డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యుటీఎఫ్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పని, సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను నిష్పక్షపాతంగా, నిబంధనలను అనుసరించి కేటాయించాలని టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో డీఈవో యాదయ్యను కోరారు. 2002 మే, జూన్‌లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు, ఓపెన్ పదో తరగతి, ఇంటర్ పరీక్ష విధులు నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు అర్జిత సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోళ్ల రామన్న, ప్రధాన కార్యదర్శి రాజావేణు, కార్యదర్శి కిరణ్‌కుమార్, కోశాధికారి కిరణ్, సీనియర్ నాయకుడు రవికుమార్ పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరి అరెస్టు

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో భూ తగాదాల విషయంలో తండ్రి కొడుకులపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరు నిందితులను గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై హన్మండ్లు పేర్కొన్నారు. ఎస్సై వివరాల ప్రకారం... మండలంలో ఈ నెల 10న పెంచికల్‌పాడ్ గ్రామానికి చెందిన సూర్యవంశీ పాండురంగ్, అంబాదాస్ తండ్రి కొడుకులపై ఆకాష్, సూర్యవంశీ ఆనంద్‌రావులతో పాటు మరో నలుగురు కర్రలు, గొడ్డళ్లతో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. అంబాదాస్ భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆకాష్, ఆనంద్‌రావులను మండలంలోని కల్లూరులో అరెస్టు చేశారు.

చట్టాలు అమలు చేయాలి

పాతమంచిర్యాల: వయోవృద్ధుల సంరక్షణ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని తెలంగాణ బలహీన వర్గాల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోతే రాజలింగు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం 'ప్రపంచ వయోవృద్ధుల వేధింపుల అవగాహన దినోత్సవం' సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వయో వృద్ధుల సంరక్షణకు మెరుగైన వసతులు కల్పించాలని, అనాథ వృద్ధుల కోసం షెల్టర్ల నిర్మాణం చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు చిరంజీవి, శరగోపం, మిరియాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

56 మంది గైర్హాజరు

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో గురువారం రెండో రోజు 56 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలకు గాను 15 మంది మాత్రమే హాజరుకాగా 56 మంది గైర్హాజరైనట్లు డీఈవో యాదయ్య తెలిపారు.

మనసులో ఉంటే కుర్చో..బెంచీనో ఇవ్వాలి

- టీసీ కోసం ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య సంభాషణ
- సోషల్ మీడియాలో చక్కర్లు

మంచిర్యాలఅర్బన్: హలో గుడ్ ఆఫ్టర్‌నూన్ సార్.. బాగున్నారా?.. పొద్దున నేనే వద్దామనుకున్నా.. బడిలో పని ఉండి రాలేకపోయా.. టీసీ కోసం పిల్లలు వస్తే మీరు డబ్బులడిగారట కదా?.. ఎవరు వచ్చిండ్రు.. సోని, శ్రీవల్లి, సంజనా, రక్షిత వచ్చి టీసీలు తీసుకెళ్లిపోయారు. డబ్బులు రేపైనా ఇవ్వమన్నారట. నేనే ట్రాన్స్‌ఫర్ చేస్తాను.. ఎవరు అడిగిండ్రు? వాళ్లకే ఇయ్యి.. అయినా మనసులో ఉంటే ఓ కుర్చో.. బెంచీనో ఇవ్వాలిగానీ.. మనకు వచ్చే జీతం చాలదాసార్? వాళ్లు ఇచ్చే కుర్చీలు, బెంచీలు కావాలా?.. అసలు మీకు, పిల్లలకు సంబంధం లేదు.. వారికి చదువు చెప్పింది మీరు కాదు.. ఇలాంటి వాటి గురించి నాకు ఫోన్ చేయొద్దు... ఎస్జీటీ టీచరు ఎస్జీటీ లెక్కనే మాట్లాడండి.. సరే నేను ఈ రికార్డును డీఈవో, ఆర్‌జేడీకి పంపిస్తాను బాయ్.. అంటూ ఇద్దరు ఉపాధ్యాయుల మధ్య సాగిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఏదేమైనా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పైతరగతులకు వెళ్లేందుకు టీసీలకోసం వెళ్తే ఉపాధ్యాయులు అడిగినంత ఇవ్వాల్సిందే. టీసీల కోసం పాఠశాలల్లో జరుగుతున్న 'మామూళ్ల'పై అధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

పాదచారులను ఢీకొట్టిన కానిస్టేబుల్ బైక్

- ముగ్గురికి తీవ్రగాయాలు


గాయాలపాలైన బేతి రవి

శ్రీరాంపూర్(మంచిర్యాల): కానిస్టేబుల్ బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. బెల్లంపల్లికి చెందిన ఏఆర్ కానిస్టేబుల్ నాగరాజు తన బైక్‌పై శ్రీరాంపూర్ నుంచి మందమర్రి వైపు వెళ్తున్నాడు. ఇదే సమయంలో స్థానిక వాసులైన కొలిపాక కుమారస్వామి, బేతి రవి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నారు. ఈక్రమంలో నాగరాజు బైక్ వారిని ఢీకొట్టింది. దీంతో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుమారస్వామి, రవిని మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి, నాగరాజును మంచిర్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై రాజేశ్ సందర్శించారు.

హలో నేను.. ఎమ్మార్వో ఆఫీస్ నుంచి...

- ఫోన్ లిఫ్ట్ చేయకపోతే ఇప్పుడే ఇన్‌కమ్ సర్టిఫికెట్ రిజెక్ట్ చేస్తా
- ఓ మహిళతో ఫోన్‌లో అసభ్యకరమైన వాయిస్ రికార్డింగ్
- నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయ అటెండర్‌కు దేహశుద్ధి


అటెండర్‌కు దేహశుద్ధి చేస్తున్న మహిళలు

నేరడిగొండ: హలో నేను నీ ఇన్‌కమ్ సర్టిఫికెట్ కొట్టిన కదా ఎమ్మార్వో ఆఫీస్ నుంచి.. తిన్నవా అని అడిగినా సప్పుడే చేస్తలేవు.. నీ భర్త ఫారెన్ వెళ్లాడు కదా.. నా ఫ్రెండే అతను ఆల్‌రెడీ.. మీరు ఏమనుకుంటున్నారు.. ఇప్పుడంటే ఇప్పుడే నీ సర్టిఫికెట్ రిజెక్ట్ చేసేస్తాను.. నేను ఏదిచేయాలో అది చేస్తాను నా చేతిలో ఉంటదది.. అంటూ జూనియర్ అసిస్టెంట్ పేరు చెప్పి నేరడిగొండ తహసీల్దార్ కార్యాలయానికి చెందిన అటెండర్ అశోక్ ఓ మహిళ ఫోన్‌కు అసభ్యకరమైన రికార్డింగ్‌లు పంపించాడు.

అటెండర్‌కు దేహశుద్ధి...

అటెండర్ అశోక్‌కు గురువారం గ్రామస్తులు, మహిళలు దేహశుద్ధి చేశారు. ఆదాయ ధ్రువీకరణ పత్రం కోసం కార్యాలయానికి వచ్చిన ఓ మహిళ ఫోన్ నంబర్‌ను దరఖాస్తు నుంచి తీసుకొని ఓ అధికారి పేరిట సదరు మహిళ ఫోన్‌కు అసభ్యకరమైన రికార్డింగ్‌లు పంపించాడు. తనతో మాట్లాడితేనే సర్టిఫికెట్ అప్రూవ్ అవుతుందని పేర్కొన్నాడు. ఈ విషయాన్ని బాధిత మహిళ గ్రామస్తులకు తెలియజేయడంతో వారు కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ ఉన్న అటెండర్‌ను గ్రామస్తులు, మహిళలు చితకబాదారు. ఆయా పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంపై మండిపడ్డారు. రోజురోజుకు మహిళలకు రక్షణ లేకుండా పోతోందని వాపోయారు. అనంతరం ఆ అటెండర్‌ను పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ పవన్‌చంద్రను వివరణ కోరగా ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు పేర్కొన్నారు.

మురుగుకాల్వలో పడి వృద్ధుడి మృతి

లక్ష్మణచాంద: ప్రమాదవశాత్తు మురుగుకాల్వలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో గురువారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన ఎర్రవోయిన పోతన్న(79) కొంతకాలంగా తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని రోడ్డు పక్కనే ఓ గుడిసెలో నివాసముంటున్నాడు. గతంలో భార్య పిల్లలను తీసుకుని వెళ్లిపోయింది. దీంతో అతడు అప్పటి నుంచి పూరి గుడిసెలో ఒంటరిగా జీవిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం సమయంలో పూరిగుడిసె వద్ద చెట్టు నీడకు వెళ్లే క్రమంలో పక్కనే గల మురుగుకాల్వలో జారిపడి మృతి చెందాడు. అటువైపుగా వెళ్లిన వాళ్లు చూసి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై రాహుల్ గైక్వాడ్ సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అల్లుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.